

సాక్షి
గుంటూరు

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.6213 టీఎంసీలు. ఎగువ నుంచి 13,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1198 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు యథావిధిగా పాఠశాలలు

గుంటూరు డీఈవో పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు శనివారం యథావిధిగా పనిచేస్తాయని గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. గత నెలలో సంక్రాంతి సెలవుల్లో నష్టపోయిన పనిదినాన్ని భర్తీ చేయడంలో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 11న అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల పరిధిలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు జరిగే విధంగా చూడాలని ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్‌ఎంలను ఆదేశించారు.

14న పీఎఫ్ పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: భవిష్యనిధి పెన్షనర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 14వ తేదీ గుంటూరులోని కృష్ణనగర్‌లో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్లు తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు, సమస్యలను తెలియజేసేందుకు వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో 9494657469 వాట్సాప్ నంబరుతో పాటు 0863–2344106, 2232921 నంబర్లను ఉపయోగించుకోవచ్చని సూచించారు. so.guntur@epfindia.gov.in మెయిల్‌కు పంపాలని తెలిపారు. వెబ్‌ఎక్స్ ఐడీ 26447532521కు పాస్‌వర్డ్ epgo*123 ద్వారా సైతం లాగిన్ కావచ్చని పేర్కొన్నారు.

జిల్లా జైలును పరిశీలించిన గుంటూరు ఎస్పీ



పట్నంబజారు(గుంటూరు): గుంటూరు జిల్లా జైలును శుక్రవారం జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. జైలు ప్రాంగణమంతా పరిశీలించి కారాగార భద్రతకు సంబంధించి అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖరరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ ఆర్.వీరేంద్రప్రసాద్, జైలర్ సీహెచ్ కిరణ్, డెప్యూటీ జైలర్ వెంకటరత్నం, అరండల్‌పేట సీఐ రామానాయక్ తదితరులు ఉన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా స్థాయి (డీఎల్‌టీసీ, ఐటీఐ) శిక్షణాధికారి ఎస్.మధుసూదనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఎల్‌టీసీ, ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా ఆయా కోర్సుల్లో నిరుద్యోగ యువతకు రెండు నెలలు పాటు శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు గూగుల్ ప్లేస్టోర్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, ఈనెల 16లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆర్‌పీవీ మణిదీప్‌ను 80746 07278 నంబర్లో సంప్రదించాలన్నారు.

యార్డులో 1,13,546 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,02,730 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,13,546 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,200 నుంచి రూ.24,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,485 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సమగ్రాభివృద్ధి లక్ష్యం

- మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి
- రూ.57 కోట్లతో అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదముద్ర
- ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలకు పచ్చజెండా



స్థాయీసంఘ సమావేశంలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి, స్టాండింగ్ కమిటీ సభ్యులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలో ఎన్నడూలేని విధంగా నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించినట్లు స్థాయీసంఘ అధ్యక్షుడు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో సుమారు రూ.57 కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు చర్చించి 165 అంశాలకు ఆమోద ముద్ర వేశారు. ఈ సందర్భంగా మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పరిశీలనలో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా చర్చించామన్నారు. డివిజన్ల వారీగా ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి ఆమోదం తెలిపామన్నారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ఆమోదం తెలిపామని చెప్పారు. నగరంలోని ప్రధాన రహదారుల్లోని ట్రాఫిక్ ఐలాండ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

తీసుకున్న నిర్ణయాలు

ప్రధానంగా నగరంలో రూ.22 కోట్లతో 60 ప్రాంతాల్లో సీసీ రోడ్లు, రూ.11 కోట్లతో 38 ప్రాంతాల్లో డ్రెయిన్లు, రూ.3.15 కోట్లతో పార్కుల అభివృద్ధి పనులు, రూ.90 లక్షలతో 2 ప్రాంతాల్లో బీటీ రోడ్లు, మరో 25 ప్రాంతాల్లో రూ.99.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రూ.6.21 కోట్లతో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, రూ.20 కోట్లతో 2023 సమ్మర్ యాక్షన్ ప్లాన్, రూ.1.49 కోట్లతో శ్మశానవాటికల అభివృద్ధి, రూ.39.59 లక్షలతో విద్యుత్ పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

ప్రధాన పనులు

గోరంట్ల మేరీప్రియనగర్, తూర్పు బజార్‌లో రూ.98.90 లక్షలతో సీసీ రోడ్లు, నరసరావుపేట రోడ్డు సాయినగర్ మెయిన్ రోడ్డులో సీసీ రోడ్డుకు రూ.50 లక్షలు, మెడికల్ క్లబ్ రోడ్డును సీసీ రోడ్డుగా మార్చడానికి రూ.50 లక్షలు, ఆదర్శ నగర్‌లో రూ.34 లక్షలతో సీసీ రోడ్డు, శాంతి నగర్‌లో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, చుట్టగుంట నుంచి చిలకలూరిపేట రోడ్డు బైపాస్ వరకు విద్యుత్ పనులకు రూ.28 లక్షలు, గడ్డిమడుల కాలనీ ఒకటో రోడ్డు నుంచి నాలుగవ రోడ్డు వరకూ రూ.46 లక్షలతో సీసీ డ్రెయిన్, చిలకలూరిపేట రోడ్డు, తిరుపతమ్మ గుడి నుంచి ఎన్ఆర్టీ రోడ్డు వరకూ రూ.30 లక్షలతో డ్రెయిన్‌లు, సుగాలి కాలనీలో రూ.49.40 లక్షలతో సీసీ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ రెండో రోడ్డు నుంచి ఐదవ లైన్ వరకూ రూ.49.90 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులు నిమ్మల వెంకటరమణ, బొద్దుపల్లి స్మిత పద్మజ, షేక్ జుమ్మాబి, మల్లవరపు రమ్య, నగర పాలక సంస్థ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగేంద్రకుమార్, ఎస్ఈ భాస్కర్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓగా డాక్టర్ శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ శ్రావణ్‌బాబును నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ సుమయఖాన్‌పై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి జనవరి 9న ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జె.హనుమంతరావుకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు శుక్రవారం డాక్టర్ హనుమంతరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు ప్రస్తుతం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ (ఎన్‌సీడీ) జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డీఎంహెచ్‌ఓగా విధుల్లో చేరిన డాక్టర్ శ్రావణ్‌బాబును వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ జె.హనుమంతరావు, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

శ్రీరస్తు.. శుభమస్తు

పేదింట వివాహానికి జగనన్న సాయం

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా అందజేత
- 202 జంటలకు రూ.1.89 కోట్లు జమ
- గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నమూనా చెక్కును నూతన వధూవరులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, ఉండవల్లి శ్రీదేవి

గుంటూరు వెస్ట్: పేద కుటుంబాల్లో వివాహాలు జరిపించడం ఎంత కష్టమో పాదయాత్రలో స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కోసమే వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాన్ని తీసుకొచ్చారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలో 202 జంటలకు రూ.1.89 కోట్లు విడుదల చేశారన్నారు.

పేదవారికి మరో అండ

పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ఇప్పటికే పేదవారికి కొండంత అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఈ పథకంతో మరో అడుగు ముందుకేశారన్నారు. తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. అనంతరం నమూనా చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యేలు కిలారి వెంకట రోశయ్య, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు షేక్ మొహమ్మద్ జియావుద్దీన్, టూరిజం శాఖ డైరెక్టర్ పఠాన్ జమీరాబేగం తదితరులు లబ్ధిదారులకు అందజేశారు.

ఊహించని సంతోషాన్నిచ్చిన ప్రభుత్వం



వాస్తవానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వస్తుందని మేము ఊహించలేదు. జగనన్న రూ.50 వేలు మా వివాహానికి బహుమతిగా ఇచ్చినట్టు భావిస్తున్నాం. దీంతో ఇంట్లో చాలా వస్తువులను కొనుక్కోవచ్చు. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కె.బాలకృష్ణ, అంబిక, చెరుకుపల్లి

జగనన్న మైనారిటీలకు పెద్ద దిక్కు



మాది పేద కుటుంబం. ఇరు కుటుంబాల సహకారంతో ఆర్భాటాలు లేకుండా వివాహం చేసుకున్నాం. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా మాకు రూ.లక్ష అందజేశారు. దీనిని మా పిల్లల భవిష్యత్తుకు డిపాజిట్ చేస్తాం.

– షేక్ అబ్దుల్ రహీమ్, షేక్ పర్వీన్‌భాను, గుంటూరు

లక్ష రూపాయలు అందాయంటే చాలా సంతోషంగా ఉంది



మాకు ఇటీవలే వివాహమైంది. స్థానిక అధికారులు సచివాలయంలో దరఖాస్తు చేసుకోమంటే చేశాం. ఇప్పుడు పిలిచి రూ.లక్ష ఇచ్చారు. ఒక్క రూపాయి కూడా లంచం అడగలేదు. ఇవ్వలేదు. గతంలో ఎప్పుడూ ఇలా లేదు. జగన్ సార్‌కు ధన్యవాదాలు.

– కె.ప్రతాప్ కుమార్, దివ్య, గుంటూరు

‘రియల్’ మోసం

లేనిస్థలం అమ్మకం

- రూ.కోటికిపైగా కాజేసిన ఘనులు
- మోసం చేశారని అడిగినందుకు చంపేస్తామని బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: లేని స్థలం ఉన్నట్లు నమ్మించి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసి రూ.కోటికిపైగా కాజేసిన సంఘటన ఇది. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు ప్రారంభించారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన డాక్టర్ మాధవి వైద్యురాలిగా పనిచేస్తుంటారు. మాధవికి దూరపు చుట్టమైన గుంటూరుకు చెందిన దుడికి రాణి పరిచయమైంది. మాధవి తాను గుంటూరులో ఏదైనా స్థలం కొనుగోలు చేయాలనుకుంటున్నానని చెప్పింది. దీంతో రాణి, గుంటూరుకు చెందిన తిరుమలకొండ వెంకటలక్ష్మి, గార్లపాటి శివప్రసాదరావు, జి.రవితేజకు మాధవి స్థలం కొనుగోలు చేయాలనుకుంటోందని చెప్పింది. ఎలాగైనా మాధవి వద్ద డబ్బు కాజేయాలనుకుని నలుగురూ కలిసి పథకం పన్నారు. నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్ రోడ్డులో సర్వే నంబర్ 253–ఎలో 480 చదరపు గజాల స్థలం ఉందని, తక్కువకు వస్తోందని మాధవికి చెప్పి నమ్మించారు. ఆ స్థలానికి ఇద్దరు నకిలీ వ్యక్తుల పేరుతో నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను కూడా తయారు చేశారు. అనంతరం మాధవికి స్థలం విక్రయించారు. ఈ క్రమంలో మాధవి తిరుమల కొండ వెంకటలక్ష్మి, గార్లపాటి శివప్రసాదరావుకు చెక్కుల ద్వారా 2022 జనవరి 10వ తేదీ ఒకరికి రూ.30 లక్షలు, మరొకరికి రూ.22,05,200 చెల్లించి మిగిలిన నగదును టీడీఎస్ ద్వారా ప్రభుత్వానికి రూ.52,800 చెల్లించింది. మరో రూ 52,80,000 నగదు రూపంలో వారికి అందజేసింది. మాధవికి విజయవాడలోనే రిజిస్ట్రేషన్ పెట్టుకుందామని చెప్పి ఒప్పించారు. అనంతరం స్థలానికి గతంలో వారు అనుకున్న విధంగా ఇద్దరు నకిలీ యజమానులను చూపించారు. చివరకు ఆన్‌లైన్‌లో విజయవాడ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎట్టకేలకు రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన కొన్ని రోజులకు మాధవి తన స్థలం వద్దకు వచ్చి చూడగా ఆ స్థలంలో వేరే వ్యక్తులు ఉండటంతో ఇదేమని మాధవి వారిని అడగటంతో ఈ సర్వే నంబర్ ఇక్కడ లేదని అయినా అది తమ స్థలమని, దానికి సంబంధించిన డాక్యుమెంట్లను మాధవికి చూపారు. దీంతో జరిగిన మోసాన్ని మాధవి గుర్తించింది. తనను మోసం చేసిన రాణి, రవితేజ, శివప్రసాదరావును అడిగింది. మోసం జరిగిందని, నీ డబ్బు నీకు ఇస్తామని చెప్పి నమ్మించారు. చివరకు డబ్బు ఇవ్వకపోగా కాలయాపన చేస్తుండటంతో మాధవి గట్టిగా వారిని నిలదీయడంతో రవితేజ, రాణి గొడవ చేస్తే చంపేస్తామని మాధవిని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన మాధవి పోలీసులను ఆశ్రయించారు. గత ఏడాది కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు విచారణ చేసి కేసులో నగదు తీసుకున్న నకిలీ యజమానులు మాధవరావు, రవీంద్రప్రభాకర్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించారు. కోర్టు నిందితులకు రిమాండ్ విధించింది. నకిలీ పత్రాలను సృష్టించి, నకిలీ యజమానులను ఏర్పాటు చేసిన అసలు నిందితులు నకిలీ ఓనర్ల పేరుతో బ్యాంకు ఖాతాలను సైతం తీసుకుని వారికి తెలియకుండా నగదును వారి ఖాతాల్లో వేయించి, అనంతరం వారికి తెలియకుండానే ఆన్‌లైన్ ద్వారా నగదు కాజేశారని విచారణలో తేలింది. కేసులో మిగిలిన నిందితుల గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు. పోలీసుల విచారణలో ఇదే ముఠా మంగళగిరిలో కూడా ఇటువంటి మోసం చేశారని తేలినట్లు సమాచారం.

ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగంలో జిల్లా వాసి

- అన్ని దశల్లోనూ ఆయన పాత్ర
- ఏటీఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ పావులూరి సుబ్బారావు



పావులూరి సుబ్బారావు



అనంత్స్ సహకారంతో తయారు చేసిన రాకెట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన అంటారిస్ జనస్–1 ఉపగ్రహం, ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 ప్రయోగ వాహనం విజయవంతం కావడం వెనుక గుంటూరు జిల్లా వాసి పాత్ర ఉంది. శుక్రవారం ఇస్రో ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 వాహనం ద్వారా విజయవంతంగా ప్రయోగించబడిన జనస్–1, ఈఓఎస్–7 అంతరిక్ష నౌకల తయారీకి జిల్లా వాసి పావులూరి సుబ్బారావు స్థాపించిన అనంత్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పూర్తి సహకారం అందించింది. ఇస్రోలోని చిన్న ఉపగ్రహ వాహకం (ఎస్ఎస్ఎల్‌వీ) ద్వారా ప్రయోగించబడిన అంటారిస్ జనస్–1 ఉపగ్రహం విజయవంతంగా కక్షను చేరుకుంది. దీనిలో ఉపయోగించిన 6యూ టెక్నాలజీ, ఉపగ్రహాన్ని రూపొందించడానికి, నిర్మించడానికి వినియోగించబడిన అంటారిస్ క్లౌడ్ సాఫ్ట్‌వేర్ వేదిక, ఎస్‌డీ లిక్స్ మాడ్యులర్ తయారీలో అనంత్స్ సంస్థ ప్రధాన వ్యవస్థల అనుసంధానకర్తగా వ్యవహరించింది. జనస్–1 అంతరిక్ష నౌకలోని పరికరాల సమీకరణ, కూర్పు, అనుసంధానం, పరీక్షలు అన్ని (ఏఐటీ) బెంగళూరులోని అనంత్స్ ఏరోస్పేస్ పార్క్‌లో పూర్తి స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. జనస్–1లోని అత్యధిక సామర్థ్యం, గరిష్ట పరిమాణం గల సౌర ఫలకాలు అన్నీ అనంత్స్ సమకూర్చింది. జనస్–1 ప్రణాళిక నుంచి ప్రయోగం వరకు, రూపొందించడం నుంచి తయారీ వరకు ఇతర ఉపగ్రహాలతో పోల్చినప్పుడు 75 శాతం తక్కువ ఖర్చుతో 10 నెలల్లోనే నిర్మించడం ప్రత్యేకత అని సుబ్బారావు సాక్షికి తెలిపారు. సమయం ఆదా చేయడంలోనూ, ఖర్చును తగ్గించడంలోనూ దేశంలోని పరిశ్రమల్లోకెల్లా అత్యంత కీలకంగా వ్యవహరించామన్నారు. అనంత్స్ తిరువనంతపురం శాఖ ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 వాహక నౌకను తయారు చేయడంలో కీలక సహకారం అందించిందన్నారు. జనస్–1 ఉపగ్రహం తయారీలోనే కాకుండా కీలకమైన ఎన్జీసీ ప్యాకేజీలు, వీఎల్‌వీ డ్రై, పైరో కార్డుల తయారీలోనూ తోడ్పడిందన్నారు. ఎస్ఎస్ఎల్‌వీ–డీ2 ప్రయోగంలో ఈఓ7–7 ఉపగ్రహం తొలి ‘పేలోడ్’ ఈఓఎస్–7కు కావలసిన ఐఆర్‌యూ, బీఎంయూ, ఎల్ఈఎంఏ, డీసీ–డీసీ కన్వర్టర్లు లాంటి అనేక ఏవోయినిక్స్ వ్యవస్థలను బెంగళూరులోని అనంత్స్ అంతరిక్ష వాహక బృందం సమకూర్చిందని తెలిపారు.

మహిళా హక్కులే మానవ హక్కులు

సంఘటితంగా పోరాడాలి

- ఒంటరిగా ఏమీ సాధించలేం
- ముఖాముఖిలో ప్రముఖ రచయిత్రి ఓల్గా
- సాహితీ సుగంధాలు వెదజల్లుతున్న పుస్తక మహోత్సవం



పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద పుస్తకాలు చూస్తున్న యువత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు సహకార దృక్పథంలో ఉన్నప్పుడే వారి విముక్తి సాధ్యమవుతుందని ప్రఖ్యాత స్త్రీ వాద రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఓల్గా అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై ఓల్గాతో ముఖాముఖీ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలను సంఘటితం చేసే సంఘాలు లేవన్నారు.

చైతన్యం కలిగించే ప్రయత్నం..

‘మహిళా హక్కులే మానవ హక్కులు’ అనే నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశానన్నారు. నిస్సహాయస్థితిలో, అభద్రతతో ఉన్న మహిళలకు అండగా సాహిత్యం ద్వారా వారికి ఆలోచనలను కల్పించటానికి వారు ఉద్యమ బాటలో నడిచేందుకు తాను కృషి చేశానని ఓల్గా అన్నారు. అస్మిత సంస్థ ద్వారా ‘మహిళావరణం’ రచనను తీసుకొచ్చానన్నారు. అందులో చరిత్రలో విస్మరణకు గురైన మహిళలను గుర్తించి అందులో చూపించానన్నారు. దానికి చాలా పరిశోధన చేసినట్లు చెప్పారు. అదే విధంగా సంప్రదాయ సంగీతం, నాట్యం, సాహిత్యాలతో అభ్యుదయ భావాలను తెలియజేసేందుకు కృషి చేశానని అందులో భాగంగానే ‘యుద్ధ–శాంతి’ నృత్య రూపాకాన్ని రచించి విజయం సాధించానన్నారు. అంతేకాకుండా లక్ష్మణరేఖ రచన ద్వారా గృహహింసను ఎదుర్కొన్న మహిళా పాత్రలను వివరించానన్నారు. అదేవిధంగా విముక్త కథల ద్వారా రామాయణంలోని పాత్రల ద్వారా చాలా అంశాలను వివరించానన్నారు. ఎవరి మనోభావాలను దెబ్బతియకుండా ఇతర భావజాలం ఉన్న వ్యక్తులను సైతం ఆలోచింపజేసే విధంగా తాను ముందుకు సాగానని, అందులో విజయంసాధించానని వివరించారు. లిబరలైజేషన్ ఆఫ్ సీతా పేరుతో పలు బాషల్లోకి అనువధింపబడి తనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు. సాహితీవేత్తలు బండ్ల మాధవరావు, వరప్రసాద్‌లు సంధానకర్తలుగా వ్యవహరించారు.

సామాజిక ఇతివృత్తాల ఆధారంగా చలనచిత్రాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రఖ్యాత సినీ దర్శకుడు సత్యజిత్ రే సామాజిక ఇతివృత్తాలనే చలనచిత్రాలుగా తీసుకొచ్చారని ప్రముఖ సినీ దర్శకుడు అక్కినేని కుటుంబరావు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో సత్యజిత్ రే ప్రతిభా వేదికపై ‘సత్యజిత్ రాయ్–జీవితం–సినిమా’ అంశంపై చర్చా కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని కుటుంబరావు మాట్లాడుతూ బైస్కిల్‌థీవ్స్ చిత్రం సత్యజిత్ రేపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిందన్నారు. ఆయన తీసిన ‘పథేర్ పాంచాలి’ చిత్రం యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను తీసుకొచ్చిందన్నారు. 1935 నుంచి 1971 వరకూ సుమారు 36 చిత్రాలు తీసిన సత్యజిత్ రాయ్ చిత్రరంగానికి సుసంపన్నం చేశారన్నారు. ఆయనకు ఆస్కార్‌తో పాటు భారతరత్న వంటి పురస్కారాలు వరించాయన్నారు కార్యక్రమాన్ని సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు నిర్వహించారు.

ఆఖరి శ్వాస ఆగినా.. అయినా ఆశ చావక!

నడింపాలెం (ప్రత్తిపాడు): ప్రాణం ఎవ్వరిదైనా ప్రాణమే. విలువ మాటల్లో చెప్పలేనిది.. మూల్యంతో వెలకట్టలేనిది. ప్రాణం విలువ తెలిసిన వారెవరైనా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తారు. కొన్ని సందర్భాల్లో వైద్యులు హోప్‌లెస్ అని చెప్పినా.. ఆశచావక ఆఖరి శ్వాస వరకూ నిలబెట్టేందుకు పోరాడుతూనే ఉంటారు. అలాంటిదే ఇక్కడ జరిగిన ఈ ఘటన కూడా. ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామానికి చెందిన షేక్ ఖాశింబి (33) స్థానికంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. రెండేళ్ల కిందట ఆ గ్రామంలోని 10వ వార్డు నుంచి వార్డు సభ్యురాలిగా కూడా గెలుపొందింది. స్థానిక మహిళలతో కలిసి శుక్రవారం ఉదయం మిర్చి పొలంలో కలుపు తీసేందుకు కూలీ పనులకు వెళ్లింది. పొలంలో గడ్డి కోస్తున్న సమయంలో విష సర్పం ఎడమకాలిపై కాటేసింది. గమనించిన స్థానికులు తొలుత ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. విధుల్లో ఉన్న వైద్యులు డాక్టర్ నాగార్జున, అఖిల్, శ్రీకాంత్‌లు ఆమెకు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, ఫలితం లేకపోవడంతో హోప్‌లెస్ అని చెప్పారు. ప్రాణం లేదని చెప్పారు. అయినా కొన ఊపిరి ఏమైనా ఉంటే బతుకుతుందేమోనన్న ఆశతో స్థానికులు చనిపోయిన ఖాశింబీని ఆస్పత్రి నుంచి బయటకు తీసుకువచ్చి ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టి విరుగుడుకు నాటు మందు ఇప్పించేందుకు మరో గ్రామానికి బయల్దేరి వెళ్లారు. అక్కడకూడా ఫలితం కనిపించకపోవడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఖాశింబీకి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు.


ఖాశింబీని ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని నాటు మందు వేయించేందుకు తీసుకువెళుతున్న స్థానికులు

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్ని బలోపేతం చేయాలని గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము సూచించారు. స్థానిక కన్నావారితోటలో శుక్రవారం గుంటూరు కో–పరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీడీసీఎంఎస్) జిల్లా మహాజన సభ సమావేశం నిర్వహించారు. ముందుగా జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి 2023–24 ఆదాయం, వ్యయానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టారు. దాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ పీఏసీఎస్ అధ్యక్షులు ఆయా ప్రాంతాల్లో అనుకూలమైన వ్యాపారాలు చేసి పీఏసీఎస్‌లను లాభాల బాటలోకి తీసుకురావాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 పీఏసీఎస్‌లు ఉండగా, అందులో 62 నష్టాల్లో ఉన్నాయని తెలిపారు. సంఘాలు ఏ వ్యాపారం చేయాలన్న పెట్టుబడి పెట్టడానికి జీడీసీసీబీ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. సొసైటీల్ని బలోపేతం చేయడానికి రోజుకు కనీసం ఒక గంట కేటాయించాలని సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పీఏసీఎస్‌లలో సిబ్బంది సహకరించడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాము మాట్లాడుతూ సహకరించని సిబ్బందికి వేతనాలు నిలిపి వేయాలని ఆదేశించారు. జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 పీఏసీఎస్‌లు, మరో తొమ్మిది ఇతర సహకార సంఘాలు సభ్యులుగా ఉన్నాయని తెలిపారు. ఈ సంఘంలోని సభ్యుల షేరు ధనం రూ.16.77 లక్షలు కలిగి ఉందన్నారు. 2022–23లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 44 జీడీసీఎంఎస్ బ్రాంచీలు రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయడంలో పాటు లేపాక్షి నోటు పుస్తకాలు, స్టేషనరీ తదితరలకు సంబంధించి రూ.61.95 కోట్ల వ్యాపారం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.97.90 కోట్ల విలువైన 47,824.04 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్‌ను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జీడీసీఎంఎస్ వ్యాపార కార్యకలాపాలు, అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కార్యాలయం మేనేజర్ కె.శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు ఎం.కృష్ణారెడ్డి, డి.రాజు, కె.హరిబాబు, ఎస్.రామయ్య, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పీఏసీఎస్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లాలుపురం రాము. వేదికపై యార్లగడ్డ భాగ్యలక్ష్మి తదితరులు

14,15వ తేదీల్లో జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14,15 తేదీల్లో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన–2023 నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ చెప్పారు. కలెక్టరేట్ వద్ద ఉన్న డీఈవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల మండలస్థాయిలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతి మండలం నుంచి ఐదు ఉత్తమ ప్రాజెక్టుల్ని ఎంపిక చేశామని తెలిపారు. ఈ విధంగా 17 మండలాల నుంచి 85 ప్రాజెక్టులతో విద్యార్థులు రానున్నట్లు తెలిపారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్స్, హెల్త్ అండ్ క్లీన్‌లైన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ క్లైమైట్ చేంజ్, మాథమాటికల్ మోడలింగ్ అంశాల వారీగా ఒక్కో ప్రాజెక్టును జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు చెప్పారు. గుంటూరు అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరగనున్న ప్రదర్శనకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. జిల్లాస్థాయి ప్రదర్శనలో న్యాయనిర్ణేతల ద్వారా 10 ఉత్తమ ప్రాజెక్టుల్ని ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరిగే ప్రదర్శనకు పంపుతామని వివరించారు. ప్రదర్శన ప్రారంభ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి రాయపాటి శివనాగేశ్వరరావు, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

తెనాలి రూరల్: భార్యను వేధించిన కేసులో భర్తకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పాండురంగపేటకు చెందిన గుండాల గంగకు చెంచుపేటకు చెందిన తిరుపతమ్మకు 2008లో వివాహమైంది. నాలుగేళ్లు వీరి కాపురం బావుండి, ఇద్దరు పిల్లలు కలిగారు. పురపాలక సంఘంలో దోమలకు మందుకొట్టే పని చేసే గంగ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురమ్మని భార్యను వేధించడం ప్రారంభించాడు. 2019 నవంబరులో భార్యపై దాడి చేసి ఇంటి నుంచి పిల్లల సహా గెంటి వేశాడు. దీనిపై తిరుపతమ్మ పోలీసుల్ని ఆశ్రయించి భర్త, అత్తమామలపై కేసు పెట్టగా అప్పటి త్రీ టౌన్ ఎస్‌ఐ కె. సుమన్ కేసు నమోదు చేశారు. ప్రస్తుత ఎస్‌ఐ ఎం. విజయ్‌కుమార్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. సాక్ష్యాధారాల్ని పరిశీలించిన మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, నిందితుడు గంగకు ఏడాది జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన వారిపై నేరం రుజువు కాకపోవడంతో కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ వాదించారు.

మూడు దశల్లో ఏపీ ఎస్‌ఆర్‌ఎం బీటెక్ ప్రవేశ పరీక్షలు

మంగళగిరి: ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో 2023 విద్యా సంవత్సరం బీటెక్ అడ్మిషన్లకు రంగం సిద్ధమైంది. మూడు దశల్లో ప్రవేశ పరీక్షల్ని నిర్వహించనున్నామని అడ్మిషన్స్ డైరెక్టర్ యలంపల్లి శివశంకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి దశ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21, 22, 23 తేదీలు, జూన్ 10, 11 తేదీల్లో రెండో దశ, జులై 22, 23 తేదీల్లో మూడో దశ పరీక్షల్ని నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. మొదటి దశ ఎంట్రన్స్‌కు విద్యార్థులు ఏప్రిల్ 16వ తేదీలోగా, సెకండ్ ఫేజ్‌లో హాజరయ్యేవారు జూన్ 5, థర్డ్ ఫేజ్‌లో వారు జులై 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్ క్లాస్‌లో 60 శాతం మార్కులు, ఇంటర్మీడియెట్ మేథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఏపీ ఎస్‌ఆర్‌ఎం బీటెక్‌లో చేరేందుకు అర్హులని వివరించారు. ఎంట్రన్స్ టెస్ట్ రిమోట్ ప్రాక్టోర్డ్ పద్ధతిలో జరుగుతుందని పేర్కొన్నారు. అడ్మిషన్లు కోరు విద్యార్థులు ఎస్‌ఆర్‌ఎం వెబ్‌సైట్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఎస్‌ఆర్‌ఎంఏపీ.ఈడీయూ.ఇన్)లో దరఖాస్తు చేసుకోవాలని ప్రొఫెసర్ శివశంకర్ తెలిపారు.

బడిలో కర్రలతో కొట్లాట

పరీక్ష రాస్తున్న తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను
కొట్టిన యువకులు, పూర్వ విద్యార్థులు

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): పాఠశాలలో పరీక్షలు జరుగుతున్న సమయంలో కొందరు యువకులు, పూర్వ విద్యార్థులు గోడలు దూకి, తరగతి గదిలోనికి వెళ్లి విద్యార్థులను కర్రలతో కొట్టిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయులు, పోలీసులు తెలిపిన ప్రకారం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య కొద్ది రోజులుగా వివాదం జరుగుతోంది. గురువారం సాయంత్రం పాఠశాల బయట ఇద్దరు రోడ్డుపై బాహాబాహీకి దిగారు. గమనించిన గ్రామ మహిళా పోలీస్ వారిని మందలించి పంపారు. అనంతరం శుక్రవారం ఉదయం ఇద్దరు పాఠశాలలో జరుగుతున్న ఎఫ్‌ఏ–3 పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్వెల్ సమయంలో బయటకు వచ్చి మరోసారి గొడవ పడ్డారు. దీంతో ఒక విద్యార్థి బయటకు వెళ్లి కొందరు యువకులకు విషయాన్ని చెప్పాడు. వారు రెచ్చిపోయి కర్రలు తీసుకుని పాఠశాల వద్దకు వీరావేశంతో వచ్చారు. స్కూల్ మెయిన్ గేట్‌కు తాళాలు వేసి ఉండటంతో కొందరు గోడలు దూకి, మరికొందరు గేట్ దూకి పాఠశాలలోకి ప్రవేశించారు. వారిని గమనించిన ఒక టీచర్ పరీక్ష హాల్‌లోకి రాకుండా తలుపులు వేశాడు. అయితే, ఆగ్రహంతో ఊగిపోయిన యువకులు తలుపులు నెట్టుకుని లోపలకు వచ్చి, మరో విద్యార్థితో పాటు అడ్డు వచ్చిన వారిని కొట్టారు. ఈ కొట్లాటలో ఒక విద్యార్థి తలకు గాయమైంది. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని, విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హెచ్‌ఎం సలోమన్ చెప్పారు.


పాఠశాల ఆవరణలో విద్యార్థుల బాహాబాహీ

12న భక్తుల దర్శనార్థం శ్రీశైలం మల్లన్న తలపాగా

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 12న భక్తుల దర్శనార్థం శ్రీశైలం మల్లన్న తలపాగా ఉంచనున్నట్లు అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బల్ల వెంకటరమణ, అల్లక తాతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల దర్శనానంతరం నగరంలో ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరూ దర్శించుకోవాలని వారు కోరారు.

ప్రజా పంపిణీ వ్యవస్థపై సమగ్ర నివేదిక అందించాలి

జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ఆహార ధాన్యాలు, గ్యాస్, పెట్రోలు, నిత్యావసర సరుకులు తదితర అంశాలపై అధికారులు ప్రతినెలా తనిఖీలు నిర్వహించి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంఎల్‌ఎస్ పాయింట్లు, రేషన్ దుకాణాలు, పెట్రోలు బంకులు, రైస్‌మిల్లులను నిర్దిష్ట విధానాలకు అనుగుణంగా తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీలు, ప్రభుత్వ వసతి గృహాల్లో పిల్లలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలని, నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసే విధానంలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పించాలని సూచించారు. కొన్నిచోట్ల అక్రమ వ్యాపారం, ప్రజలతో వ్యవహరించే తీరు ఇబ్బందికరంగా ఉంటోందని ఫిర్యాదులు అందుతున్నాయని, వీటిని ఉపేక్షించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణాలకు పంపిణీ అయ్యే బియ్యం, కంది పప్పు సరిపడా నిల్వ ఉంచేటట్లు చేయాలని ఆదేశించారు. ప్రతినెలా రెండో శుక్రవారం నిర్వహించే సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ఎస్.పద్మశ్రీ, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి, డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ

వధూవరులకు ఆశీర్వాదం

స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలో పాల్గొన్న నూతన వధూవరులను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తన చాంబర్‌లో ఆశీర్వదించారు. దాంపత్య జీవితాన్ని సుఖసంతోషాలతో ఆదర్శంగా కొనసాగాలని సూచించారు.

కనీస అవసరంగా వైద్యం

- ఆరోగ్య బీమా అందరికీ వర్తింపజేసేందుకు ప్రభుత్వాల కృషి
- రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య కె. రామ్మోహనరావు
- ఏఎన్‌యూ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు


ప్రసంగిస్తున్న ఆచార్య కె రామ్మోహనరావు

ఏఎన్‌యూ: ప్రస్తుత సమాజంలో వైద్యం మనిషి కనీస అవసరంగా మారిందని రాష్ట్ర ఉన్నత విద్యమండలి వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావు అన్నారు. నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'భారత దేశంలో ఆరోగ్య బీమా ఆవశ్యకత' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన రామ్మోహనరావు ప్రసంగిస్తూ దేశంలో 70 శాతం ప్రజానీకం ఏదో ఒక రూపంలో ఆరోగ్య బీమా పరిధిలో ఉన్నారన్నారు. మిగతా వారిని కూడా తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అత్యధిక మోసాలు ఆరోగ్యబీమా విభాగంలోనే చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఈ పరిణామాలు ఆర్థికరంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ వంటి రాష్ట్రాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్పష్టమైన విధానాలతో పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ బీమాతో ప్రజారోగ్యం భద్రంగా ఉండాలని, ప్రజారోగ్యం ప్రాథమిక బాధ్యతలో ఒకటన్నారు. ప్రజారోగ్యానికి ఉపయోగపడే మరిన్ని ఆరోగ్య బీమా పథకాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధ్యాపకులు ఆచార్య డి. రాజ్‌మోహన్ ప్రసంగిస్తూ ఆరోగ్య బీమా వైద్యరంగంలో ఓ కీలక అంశమన్నారు. రాబోయే రోజులలో ఆరోగ్య బీమా రంగ పరిధి విస్తృతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ జనరల్ మేనేజర్ మహ్మద్ సాజిద్ కీలకోపన్యాసం చేస్తూ కోవిడ్–19 సమయంలో పలు ఆరోగ్య బీమా సంస్థలు రూ. 800 కోట్లకుపైగా పాలసీదారులకు చెల్లించాయన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ వి.తులసీదాస్ సదస్సులో చర్చిస్తున్న అంశాలను వెల్లడించారు. రెక్టార్ ఆచార్య పి వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, మేనేజ్‌మెంట్ డీన్ ఆచార్య ఆర్ శివరామ్ ప్రసాద్, మంగళగిరి ఎన్నారై వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ఆచార్య శ్యాంసన్ సంజీవరావు ప్రసంగించారు. అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.